కంచి పరమాచార్య

శ్రీశ్రీశ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీస్వామి

అమృతవాణి

3

# షట్పదీస్తోత్రం

అనువక్త

దేవరకొండ శేషగిరిరావు

ఎమెస్కో

# విషయ సూచిక


1. షట్పదీస్తోత్రం 7-76

2. ఉపవేదములు 77-175

# షట్పదీస్తోత్రం

## శంకరుల స్తోత్రాలు

బ్రహ్మసూత్రాలు, గీత, ఉపనిషత్తులపై ఆది శంకరులు అద్వైతపరంగా వ్యాఖ్యానం చేసినట్లు జగత్ప్రసిద్ధం. వివేక చూడామణి, ఉపదేశ సాహస్రి వంటి ప్రకరణ గ్రంథాలను స్వతంత్రంగా వ్రాసేరు.

పరమాత్మయే సత్యమని, జగత్తు మిథ్యయని; జీవుడే పరబ్రహ్మయని చెప్పేది అద్వైతం. ఇది వేద సమ్మతమని నిరూపించారు.

అయితే ఈ సిద్ధాంతం సామాన్య జనులకు అందుబాటులో ఉండదు కదా! బౌద్ధికంగా జీవ పరమాత్మలను తెలుసుకొని ప్రయోజనం ఏమిటి? శాంత మనస్కులమై దీనిని ఒంట పట్టించుకొనే స్థితిలో లేం. మనకు అనుభవంలో ఉన్నది ఈ జగత్తు. పరుగులెత్తే మనస్సుతో కాక స్తిమితమనస్కులకు మాత్రమే అద్వైతానుభూతి కల్గుతుంది. కనబడేదంతా భ్రాంతియనే భావన అంత చటుక్కున అనుభవంలోకి వస్తుందా? అట్టి అనుభవం రావడానికి సత్కర్మలు, అనుష్ఠానం, తద్ద్వారా చిత్తశుద్ధి ఏర్పడగా అద్వైత సిద్ధి.

అయితే సామాన్య జనులకు మార్గమేమిటి? సామాన్యులకు భాష్యాలు, ప్రకరణ గ్రంథాలు ఆమడ దూరంలో ఉంటాయని పరమకరుణతో వేదాంత శిఖరాన్ని అధిరోహించిన శంకరులు మనకై దిగివచ్చి అనేక ఉపాయాలను, క్రమమార్గాన్ని అందించారు.

ముందుగా ప్రత్యేకమైన కోరికలు, కోపతాపాలు లేకుండా శాస్త్రం విధించిన కర్మలను చేయాలన్నారు. కర్మలను చేస్తున్న కొద్దీ చంచలమైన మనస్సు కొంత కట్టుబడుతుంది. అది ఇంకా అదుపులో ఉండాలంటే సగుణ మూర్తియైన అనగా ఒక ఆకారం, కల్యాణ గుణాలు కలిగిన మూర్తిని ఆరాధించాలన్నారు. సంతోష

పూర్వకంగా అట్టి రూపాన్ని సాధకుడు ధ్యానిస్తాడు. ఇష్టదేవతా మూర్తి తన కృపను చూపించి ఆరాధించేవాడు, ఆరాధింపబడే వాడనే భేదభావం క్రమక్రమంగా తొలగిపోయి నిర్గుణ బ్రహ్మానుభవం కల్గుతుందని మార్గం చూపించారు.

అందువల్ల భక్తి ఉపాసనను మనబోంట్లకు కర్మానుష్ఠానంతో బాటు విధించారు. ఎట్లా ఉపాసించాలో, ఎట్లా ప్రార్థించాలో సామాన్యులకు తెలియజేయడం కోసం వారే అనేక దేవతలపై అనేక స్తోత్రాలు చేసారు.

శివానందలహరి, సౌందర్యలహరి వంటి శతకాలే కాకుండా అనేక సోత్రాలను అందించారు. ఈ స్తోత్రాలు సులభశైలిలో ఉంటాయి. భావగర్భితంగా ఉంటాయి. విద్వాంసులకే పరిమితమైన భాష్యాలను ఎట్లా వ్రాసేరో అట్లాగే చిన్న పిల్లలు కూడా కంఠస్థం చేయదగిన శ్లోకాలనూ అందించారు.

## షట్పదీస్తోత్రం

సర్వజగద్రక్షకుడైన శ్రీమహావిష్ణువు నుద్దేశించి షట్పదీస్తోత్రాన్ని వ్రాసేరు. ఇది మనస్సులో నిలపగలిగితే శంకరులను, మహావిష్ణువును, మనలను మనం గుర్తించగలం. మనలను మనం తెలిసికొనడమే అద్వైతం. ఈ స్తోత్రమూ అద్వైతానికి దారి చూపిస్తుంది.

## పదం - కవిత్వంలో భాగం

షట్పదియనగా ఆరు పదములు లేదా ఆరు కాళ్లు ఉన్నది. ఆరుకాళ్లతో ఉన్నదేమిటి?

పదం అనగా పాదమని, ఒక పదమని అర్థం కదా! శ్లోకంలో నాల్గవ వంతు పదము, లేక పాదము. మన శరీరంలో కాళ్లు నాల్గవవంతున్నాయి కదా! అట్లాగే నాల్గవ వంతు, పాదము లేక పదం.

ఇట్లా నాల్గు పాదాలతో ఉండడం వల్ల శోకాన్ని పద్యమన్నాం. పదమనే దానికి కొన్ని అక్షరములు కలిగినదనే అర్థం గ్రహిస్తే, గద్యం కూడా పద్యమై పోతుంది. అదీ పదాలతోనే ఉంటుంది కదా! కనుక వచనాన్ని గద్యమన్నారు. గద్ అనగా మాట్లాడుట. కనుక సంభాషణ గద్యంలోనే సాగుతుంది. పద్యంలోని ఒక్కొక్క పాదము ఇన్నిన్ని అక్షరాలతో లేదా గణాలతో ఉండడం వల్ల శ్లోకాలను పద్యమని అన్నారు. నాల్గు పాదాలూ ఉంటాయి ఇందులో. పాటలు కవిత్వంతో ఉంటాయి. కనుక అవీ పద్యములే.